క్లుప్తంగా

శరవేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు


నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం-2 భవనం

నందవరం: మండల కేంద్రంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ పనులను పంచాయతీ రాజ్ అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పూర్తిగా చెల్లిండంతో పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి (ఆర్బీకే) రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్లకు రూ.17.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరుకల్లా భవన నిర్మాణాలు పూర్తి చేస్తామని పీఆర్ అధికారులు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో 'గ్రామ సచివాలయాలో మా నామ్మకం నువ్వే జగనన్న' బోర్డు ఆవిష్కరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9వ తేదీన మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1లో ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించాలన్నారు. ఇందుకు తగిన ఏర్పాటు చేసుకోవాలని సచివాలయ సిబ్బంది, నోడల్ ఆఫీసర్‌కు సూచించారు. సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఏఓ కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కప్పట్రాళ్లలో ట్రైనీ డీఎస్పీల పర్యటన


ఎస్ఐతో గ్రామ వివరాలను తెలుసుకుంటున్న ట్రైనీ డీఎస్పీలు రఘువీర్, భావన

దేవనకొండ: ఫ్యాక్షన్ గ్రామమైన కప్పట్రాళ్లలో మంగళవారం ట్రైనీ డీఎస్పీలు రఘువీర్, భావన పర్యటించారు. గ్రామ స్థితిగతులపై అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్షన్ వల్ల నాడు ఎదుర్కొన్న సమస్యలు, జీవన విధానంపై ఆరా తీశారు. అనంతరం దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. వీరి వెంట ఎస్ఐ భూపాలుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన


ఏఎన్ఎం సంధ్యను అభినందిస్తున్న వైద్య సిబ్బంది

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న సంధ్య సేవలు గుర్తించి విశాఖపట్టణం మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు రాష్ట్ర ఉత్తమ సేవా రత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు రఘురామిరెడ్డి, దుర్గాబాయి, వైద్య సిబ్బంది అవార్డు గ్రహీత ఏఎన్ఎం సంధ్యను అభినందించారు. ఆమె మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తాం


మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసులు

హాలహర్వి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడం వల్ల మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్కొక్క కుటుంబానికి అదనంగా 50 రోజులు పనులు కల్పిస్తామని ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఒక్కొక్క కుటుంబానికి 150 రోజులు పనులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఐదు నెలల వరకు పని కొనసాగించవచ్చన్నారు. వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా స్థానికంగా ఉపాధి పనుల్లో పాల్గొని లబ్ధి పొందాలని సూచించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రైతన్నకు కొండంత 'భరోసా'

- మండలంలో 13,716 మందికి పెట్టుబడి సాయం
- రూ.5.48 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఆనందంలో అన్నదాతలు


లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్న ఏఓ రవి

నందవరం: వ్యవసాయం దండగ అన్న నేతల నోళ్లు మూతబడుతున్నాయి. పండగలా వ్యవసాయం సాగాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా సాయం రైతుల మోములో సంతోషం నింపుతోంది. అలసిన రైతులకు పెట్టుబడి సాయం బాసటగా నిలుస్తోంది. వరుసగా ఐదో ఏడాది రెండో విడతగా రైతులకు సాయం అందజేస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే సాయాన్ని గొప్పగా భావించి రైతన్నలు ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏటా మూడు విడతల్లో రైతు భరోసా నిధులు రైతులకు అందజేస్తున్నారు. రబీ సీజన్ నేపథ్యంలో ఈనెల 7వ తేదీన రూ.4,000 రైతుల పెట్టుబడి సాయం మంజూరు చేశారు. నేరుగా రైతుల ఖాతాల్లో జమ జేసి రైతులకు ఉపశమనం కల్పించారు.

మండలంలో దాదాపు 53 వేల ఎకరాల సాగు భూమి ఉంది. సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందుతోంది. 13,716 మంది రైతులకు ఆర్థికం సాయం మంజూరవుతోంది. వరుసగా ఐదవ ఏడాది రెండవ విడత సాయంగా రూ.4,000 చొప్పున మంజూరు కావడంతో మండలానికి రూ.5.48 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. సరైన సమయంలో పెట్టుబడి సాయం మంజూరు కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో సాగు అవసరాలకు ఆసరాగా నిలుస్తాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

7579 మందికి రైతు భరోసా సాయం

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో 7579 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున రూ.3,03,16,000 మంజూరైయినట్లు ఏఓ రవి తెలిపారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మద్దికెర తూర్పు – 862, మద్దికెర పడమర – 932, మద్దికెర ఉత్తరం – 909 పెరవలి – 1557, ఎం.అగ్రహారం – 504, బురుజుల – 639, ఎడవలి – 670, హంప – 1506 మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు వివరించారు. ఈ మేరకు నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు.

సంతోషంగా ఉంది



రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కావడం ప్రజల అదృష్టం. రైతుల గురించి ఏ పాలకుడు పట్టించుకునేవారు కాదు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత పంటలు సమృద్ధిగా పండి ప్రభుత్వ చర్యలతో గిట్టుబాటు ధరలు కూడా లభిస్తున్నాయి. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందుతోంది. ఇలాంటి ముఖ్యమంత్రి మరింత కాలం పాలిస్తే రైతుల బతుకులు మారతాయి.

– నరసింహులు, రైతు, పెద్దకొత్తిలి

పెట్టుబడులకు ఆసరా



నా పేరిట రెండెకరాల పొలం ఉంది. ఇప్పటివరకు నాకు నాలుగు విడతల రైతు భరోసా నిధులు వచ్చాయి. దాదాపు 54,000 రూపాయలతో పాటు ప్రస్తుతం రూ.4,000 నగదు ఖాతాలో జమ అయ్యింది. ఇలాంటి సాయంతో రైతుల అవసరాలు తీరుతున్నాయి. రబీ పంటల సాగు కోసం పెట్టుబడులకు దిగులు లేకుండా పోయింది.

– రాములమ్మ, మహిళా రైతు, నందవరం మండలం

నేడు సామాజిక తనిఖీ

గోనెగండ్ల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బుధవారం ఉదయం 9 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 01.04.2022 నుంచి 31.03.2023 వరకు జరిగిన ఉపాధి పనులపై 17వ సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాల్లో విచారణ చేసిందని చెప్పారు. ఇందులో భాగంగానే 01.09.2023 నుంచి 30.09.2023 వరకు జరిగిన పనులను కూడా విచారణ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై బుధవారం ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఆలూరులో మోస్తరు వర్షం

ఆలూరు రూరల్: ఆలూరులో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రబీలో సాగుచేసిన పప్పుశనగ, జొన్న, కంది పంటలకు ఊరటనిచ్చింది. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇప్పటివరకు 26 వేల హెక్టార్లలో పప్పుశనగ, 3 వేల హెక్టార్లలో పత్తి, కంది, జొన్న పంటలు సాగు చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షంతో పంటలు సాగు చేసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతులకు నగదు జమ చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాసేవకే నా జీవితం అంకితం


ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

పత్తికొండటౌన్/కృష్ణగిరి: ప్రజా సేవకే నా జీవితం అంకితం అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె జన్మదిన వేడుకలను మంగళవారం పత్తికొండలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పత్తికొండకు వచ్చి ఎమ్మెల్యేను కలసి పూలబొకేలు, మొమెంటోలు అందజేసి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే శ్రీదేవి బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేకు ఆర్డీఓ నీలపు రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో కలసి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రధాన రహదారి మీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో వందలాది కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. నియోజకవర్గ ప్రజల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనని, అంకితభావంతో ప్రజలకు సేవ చేసి, అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకుని 6 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక హోసూరు రోడ్డులోని రెండు అనాథ వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. ఎంపీపీలు నారాయణదాసు, వెంకట్రామిరెడ్డి, ఆదెమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ఉరుకుందమ్మ, మురళీధర్‌రెడ్డి, కేతు సుభాషిణి, పులికొండ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

- చుంచు ఎర్రగుడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ లక్ష్మీకాంత రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు బాణసంచా పేల్చి, కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. యూత్ కన్వీనర్‌తోపాటు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ సుకన్య చేతుల మీదుగా 70 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కొందరు మహిళలు ఎమ్మెల్యే ముఖచిత్రం కలిగిన మాస్క్‌లను ధరించి అభిమానం చాటుకున్నారు.
- చెరుకులపాడు నారాయణరెడ్డి యూత్, ప్రాథమిక సహకార సొసైటీ ఉద్యోగులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, ఇన్, అవుట్ పేషెంట్లకు, సిబ్బందికి బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. సొసైటీ సీఈఓ రామకృష్ణ, శివ, తదితరులు పాల్గొన్నారు.


చుంచు ఎర్రగుడి గ్రామంలో చీరలు పంపిణీ చేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి, సుకన్య తదితరులు


వెల్దుర్తి ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న నారాయణరెడ్డి యూత్ సభ్యులు

టౌన్ బ్యాంక్ పాలకవర్గం గడువు పొడిగింపు


టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్‌ను సత్కరిస్తున్న బ్యాంక్ సీఈఓ, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక టౌన్‌బ్యాంక్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ పాలకవర్గం పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర కో–ఆపరేటివ్ సొసైటీస్ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 10వ తేదీన పాలకవర్గం గడువు ముగియడంతో ప్రస్తుతం పొడిగింపు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో స్థానిక టౌన్‌బ్యాంక్‌లో పాలకవర్గ చైర్మన్ యూకే రాజశేఖర్‌ను సీఈఓ గంగాధర్, సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పాలకవర్గ గడువును పొడిగించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పాలకవర్గంతో పాటు, సిబ్బంది సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. బ్యాంక్ డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, వడ్డెరంగన్నలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడి అరెస్టును చూపుతున్న ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి బైక్ సీజ్ చేసినట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చిన సమాచారం మేరకు.. మంగళవారం ఉదయం 7.45 గంటలకు మండలంలోని హత్తిబెళగల్ గ్రామ రహదారిలో ఉన్న భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. మొలగవల్లి గ్రామానికి చెందిన మోహన్, రామాంజినేయులు టీవీఎస్ స్కూటర్‌పై అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసి ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదే గ్రామానికి చెందిన అశోక్, కాశీనాథ్ అనే ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని చెప్పారు. ఏఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ జానీవాకర్, రంగయ్య సిబ్బంది హనుమంతప్ప, కేశవ రెడ్డి ఉన్నారు.

ఓటరు దరఖాస్తులపై సమగ్ర విచారణ


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇప్పటివరకు వచ్చిన ఓటరు దరఖాస్తులపై సమగ్ర విచారణ చేపట్టాలని పత్తికొండ ఎన్నికల అధికారి, ఆర్డీఓ రామలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాముడుతో కలిసి బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. నూతన ఓటుకు దరఖాస్తుతోపాటు, సవరణలపై వచ్చిన దరఖాస్తుల విచారణలో జాప్యం చేయకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పలు దరఖాస్తులపై బీఎల్ఓలు నిర్వహించిన విచారణ, స్వీకరించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. మరణించిన వారి వివరాలు, పత్రాలు సేకరించడం జరుగుతున్నా, డబుల్ ఓట్ల తొలగింపునకు ఓటర్ల సహకారం అవసరమన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటు నమోదు, సవరణలకు అవకాశముందని, వచ్చిన దరఖాస్తులను విచారణ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు.

కార్మికుల భద్రతకు చట్టం తేవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): కార్మికుల సంక్షేమం కోసం సంపద కేటాయించి వారి భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బజారు హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొన్నారు. కార్మికుల హక్కులను పోరాడైనా సాధించుకోవాలన్నారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న మహా ప్రదర్శన బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ, హమాలీ యూనియన్, పలు సంఘాల మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రాంపల్లికి ఎమ్మెల్యే రాక

తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లి గ్రామానికి బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. గ్రామంలో రూ.65 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్‌బీకే భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ప్రమాదంలో మృతి చెందిన లింగన్న

ఆస్పరి: మండలంలోని చిగిళి బస్టాప్ సమీపంలో మంగళవారం రాత్రి కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు మేరకు.. ఆదోని నుంచి ప్యాసింజర్ ఆటో ఆస్పరికి వెళ్తుంది. అటు వైపు నుంచి కారు ఎదురొచ్చి ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆస్పరికి చెందిన రైతు లింగన్న (55) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్పరికి చెందిన నాగరాజుతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన పల్లవి, దీపిక

ఆస్పరి: ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న పల్లవి, 10వ తరగతి చదవుతున్న దీపిక జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శారోన్ స్మైలీ, పీఈటీ రాజేశ్వరి మంగళవారం తెలిపారు. ఈనెల 3వ తేదీన పశ్చిమ గోదావరిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 యోగా పోటీల్లో పల్లవి, అండర్–17 విభాగంలో దీపిక ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. త్వరలో త్రిపురలో జరిగే యోగా పోటీల్లో వారు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్, పీఈటీలు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఆనంద్‌రావు మంగళవారం తెలిపారు. ఇటీవల కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ –14 వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని మనీషా, 7వ తరగతి విద్యార్థిని వర్ష ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విశాఖ పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు చెప్పారు. వీరిని హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

వేగంగా సీసీ రోడ్డు పనులు


సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

దేవనకొండ: యేళ్ల తరబడి సీసీ రోడ్లకు నోచుకోని ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ స్పష్టం చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా దేవనకొండ-1, 2 సచివాలయాలకు రూ.40 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. దీంతో చాలా సంవత్సరాలుగా కాలనీలు ఏర్పడినా మౌలిక వసతులకు నోచుకోని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. దేవనకొండలోని చాకలి వీధి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సీసీ రోడ్డు, మురుగు నీరు కాలువ నిర్మాణం వాల్మీకి ఆలయం వరకు చేపడుతున్నామని చెప్పారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్సతో క్యాన్సర్ నుంచి విముక్తి


పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్యులు

మద్దికెర: క్యాన్సర్‌ను ప్రథమ దశలో గుర్తించి సరైన చికిత్స, మందులు వాడడం వల్ల పూర్తిస్థాయిలో నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక పభుత్వ వైద్యశాలలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ వ్యాధికి పూర్తిస్థాయిలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. క్యాన్సర్ నుంచి కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ హైపటైటిస్ బి వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం, ధూమపానం, మద్యపానం నివారించాలన్నారు. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడమే గాకుండా శారీరక వ్యాయామాలు చేయాలని సూచించారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్‌ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, సిబ్బంది పాల్గొన్నారు.

మార్లమడికి డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు


మార్లమడికి రోడ్డులో గ్రావెల్ వేసి తాత్కాలిక పనులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు (ఫైల్)

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటకను కలిపే 5 కి.మీ మార్లమడికి పంచాయతీ రాజ్ రోడ్డును రెండు లైన్ల రహదారిగా మార్చేందుకు రూ.5.40 కోట్ల నిధులు మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకుడు ఈశా, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు మంగళవారం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు సంబంధిత ఉన్నతాధికారులు మార్లమడికి సింగిల్ రోడ్డు నుంచి డబుల్ రోడ్డు ఏర్పాటుకు కొత్త ఎస్టిమేట్‌ను తయారు చేసి పంపించగా ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా హొళగుంద– ఆలూరు వయా ఎల్లార్తి రోడ్డు మరమ్మతులకు రూ.4.60 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. త్వరలో పనులు కూడా ప్రారంభమౌతున్నట్లు వారు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హొళగుంద మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, టీడీపీ పాలనలో చెప్పుకోవడానికి ఒక్క అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు జరగలేదన్నారు. అలాగే అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు 3 సెంట్ల ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కెబినేట్‌లో తీర్మానించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరం


ఆలూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరమని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. మంగళవారం ఆలూరులోని సచివాలయం-2లో ఇంటి వైద్యం అనే కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. 126 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగుల ఇళ్ల వద్దకే ఏఎన్ఎంలు వెళ్లి వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక యాప్‌లో వారి ఆరోగ్య వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల: గోనెగండ్ల మండలం సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆ యన విలేకరులతో మాట్లాడుతూ.. మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఉద యం 11 గంటలకు జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో–ఆప్షన్‌మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.